మిస్. భారతి బి.ఏ.

"శైలజకూ సురేష్‌కూ మహావైభవంగా వివాహం జరిగింది. పెద్దలందరూ వధూవరులను ఆశీర్వదించారు."

ఆఖరివాక్యం చదివి విసుగుతో పుస్తకాన్ని విసిరి కొట్టింది భారతి. లేచినుంచుని చీరె కుచ్చెళ్ళు సవరించుకుని వొళ్ళు విరుచుకున్నది. తర్వాత నెమ్మదిగా నడచిపోయి అద్దంలో మొహం చూసుకున్నది. ఒక్కక్షణం తర్వాత మళ్ళీ అద్దాన్ని బల్లమీదవుంచి కిటికీ పక్కన కుర్చీలో కూర్చున్నది.

కిటికీలోనుంచి తెల్లని చంద్రబింబం కనిపిస్తున్నది. ఎదురింటి ఆవరణలోవున్న కొబ్బరిచెట్ల ఆకులమీద వెన్నెల

వెండిమలామా పూస్తున్నది. ఎవడో బిచ్చగాడు ఇంటి ముందు నిలబడి ఎంతోసేపటినుంచి కేకలువేసి విసిగిపోయి కదిలి వెళ్ళిపోయాడు. వీధి చివర పెళ్ళివారి ఇంటిలోనుంచి సన్నాయి వాద్యం గాలి విసురుకు ఉండి ఉండి మల్లెపందిరి దులిపినట్టు మనోహరంగా వినవస్తున్నది

భారతి నిట్టూర్చింది. మొన్నటిరాత్రి ఎనిమిది గంటల వరకూ మిస్. శకుంతలగావున్న తన స్నేహితురాలు—తన కన్నా చిన్నది – ఆ పూటనుంచి మిసెస్ శకుంతలా రఘురామ్‌గా మారిపోయింది. మరి కొద్దిరోజులలో భర్తతోపాటు భిలాయ్ వెళ్ళిపోతుంది. తర్వాత సంసారం, పిల్లలూ హడావిడిలో పడిపోయి ఎప్పుడైనా సంవత్సరానికో రెండుసంవత్సరాలకో బుద్ధిపుట్టిననాడు మళ్ళీ పుట్టింటికి వస్తుందికాబోలు !

భారతి కుర్చీలోనుంచి లేచి విసుగ్గా అటూ ఇటూ పచారుచేసింది. గోడమీద ఆమె నీడ చిత్రంగా కదులుతూవుంటే అటేచూస్తూ ఏదో ఆలోచనలోపడి అలా చాలాసేపు పచారుచేస్తూ ఉండిపోయింది. ఆమెకు క్రితంరాత్రి పెళ్ళి వూరేగింపు గుర్తువచ్చింది. శకుంతల తల్లిదండ్రులు సంపన్నులు. ఆమె వారికి ఒక్కతే ఆడపిల్ల. పైగా వరుడు ఉన్నతోద్యోగి. అందువల్ల వారు డబ్బు విరజిమ్మి ముచ్చటలూ, వేడుకలూ ఘనంగా జరిపించారు. ఒక కారును పూర్తిగా పూలతో నింపివేశారు. ముందు యూనిఫారం ధరించిన బ్యాండ్ మేళమూ వెనక సన్నాయిమేళమూ తర్వాత వధూవరులు కూర్చున్న పూలకారూ, దాని వెనుక నెమ్మదిగా నడుస్తున్న బంధువులూ అలా నేత్రపర్వంగా ఆ వూరే

గింపు తమ ఇంటిముందుగా సాగిపోతూవుంటే భారతి కన్నులింతలు చేసుకుని రెప్పవెయ్యకుండా చూస్తూ నిలబడింది. ఆ వూరేగింపు తమ ఇంటినిదాటి ఎంతో ముందుకు వెళ్ళి సందుమలుపు తిరిగేవరకూ అలా గుమ్మాని కానుకుని ఆమె కళ్ళార్పకుండా చూస్తూనే ఉండిపోయింది. తర్వాత తలుపులు మూసి లోపలికి వెళ్ళి పక్కమీదవాలి నిద్రపోదామని ఎంత ప్రయత్నంచేసినా ఆమె కళ్ళలో చాలాసేపటివరకూ ఆ మనోహర దృశ్యమే నిలచిపోయింది.

భారతి తన నీడను చూసుకుంటూ పచారుచేస్తున్నదల్లా చటుక్కున ఆగిపోయింది. ఆమె కెదురుగా గోడమీద ఆమె బి. ఏ. పట్టా వేలాడుతున్నది. ఆమె తండ్రి డిగ్రీ కాయితం రాగానే ముచ్చటపడి దానికి ఫ్రేముకట్టించి గోడకు తగిలించి ఉంచాడు.

భారతి దగ్గరగావెళ్ళి దాన్ని పైనుంచి క్రిందిదాకా చదివింది. తర్వాత కొద్దిక్షణాలు ఆగి మళ్ళీ చదివింది తన పేరును మళ్ళీ మళ్ళీ చూసుకున్నది. ఆ డిగ్రీ తనకు పద్దెనిమిదోయేట చేతికి వచ్చింది. అంటే అయిదేళ్ళ క్రిందటి సంగతి అది. అప్పటికి చదువూ, కాలేజీ ధ్యాసతప్ప తనకు మరేమీ ఉండేదికాదు. తోటి ఆడపిల్లలతో కాలేజీకివెళ్ళి శ్రద్ధగా పాఠాలు విని నేరుగా ఇంటికి వచ్చేయటం, ఇంటి పనులలో తల్లికి సాయంచేసి మిగిలిన వ్యవధిలో తన పుస్తకాలు ముందువేసుకుని కూర్చోవటం. అంతేతప్ప కాలేజీ పిల్లలు గుంపులు గుంపులుగా తమ వెనుక, నడుస్తూకొందరూ, సైకిళ్ళమీద కొందరూ, పోజులువేస్తూ వ్యంగ్యంగా

మాట్లాడుకుంటూ వస్తూవున్నా పట్టించుకోవడం జరిగేది కాదు. అప్పుడప్పు డామె తల్లి మాత్రం "ఎదిగిపోయిన పిల్లనిలా ఎన్నాళ్ళని ఇంట్లో ఉంచుకుంటామండీ! ఎక్కడన్నా సంబంధాలు విచారించండీ" అంటూ ఉండేది. అందుకు సమాధానంగా ఆమె తండ్రి నవ్వి వూరుకునేవాడు. తప్పక సమాధానం చెప్పవలసి వచ్చినప్పుడు మాత్రం "అబ్బ! వూరుకోవే! దాని పరీక్షలు కాకుండా ఎలాగా? అయిన తర్వాత చూద్దాంలే" అనేవాడు. తర్వాత తన పరీక్షలైపోయాయి. అప్పుడొకరు పెళ్ళిచూపులకు వచ్చారు. చూసుకుని వెళ్ళిపోయారు. వారి దగ్గరినుంచి వెంటనే ఉత్తరం వచ్చింది. తమ పిల్లవాడు స్కూల్ ఫైనల్ మాత్రమే ప్యాసయినాడనీ, వాడికి బి. ఎ. పిల్లను చేసుకోవటం తమకు ఇష్టంలేదనీ, పిల్ల బి. ఎ. పరీక్షకు వెళ్ళిందన్న సంగతి తెలియక చూపులకని వచ్చి ఇబ్బంది కలిగించినందులకు క్షమించవలసిందనీ ఉత్తరంలో సారాంశం. తర్వాత ఫలితాలు తెలిశాయి. తాను అన్ని పార్టులలోనూ ప్యాసయింది...గ్రూపులో సెకండ్ క్లాసు... మరొక నెల రోజులకు మరొక సంబంధం వచ్చింది. కట్నం విషయంలో తాము తూగలేకపోయారు. మరొక సంబంధం. వరుడు నల్లనివాడు. అతనికి తాను నచ్చలేదట...తర్వాత మరొక సంబంధం...వరుడు ప్లీడరు... అప్పుడు వరహీనం అనుకుని వెళ్ళిపోయారు...ఆ తర్వాత క్రమంగా కాలం గడిచేకొద్దీ "ఇంత ఈడొచ్చినా పెళ్ళి కాలేదెందుకో..." అనే మిషతో సంబంధాల సంఖ్య తగ్గిపోయింది. సంవత్సరం క్రిందట తానీ ఉద్యోగంలో చేరినప్పటి

నుంచీ ముచ్చుకైనా ఎవరూ రాలేదు. తండ్రికి వస్తున్న పెన్షన్ రాళ్ళు తప్ప వేరే ఏ ఆదాయమూ లేని తమ ఇంటి పరిస్థితి తాను ఉద్యోగంలో చేరిన తర్వాత వస్తున్న తొంభయి రూపాయలతో కొంచెం కుదుటపడింది.

భారతి జడ ముందుకు వేసుకుని చివరలు విప్పి మళ్ళీ అల్లుకుంటూ అటూ ఇటూ తిరగడం ప్రారంభించింది. బల్ల మీద తెల్లని కవరు కనిపించేసరికి వెళ్ళి దాన్ని చేతిలోకి తీసుకుంది. ఆ కవరు నాలుగు మూలలా పసుపు పూయబడి ఉంది. లోపల తెల్లని ఆర్టు పేపరుమీద శుభలేఖ. మామయ్య కూతురు శశి పెళ్ళి... మొన్న రాత్రి ఇక్కడ శకుంతలకు ఏ ముహూర్తంలో పెళ్ళి అయిందో సరిగ్గా అదే ముహూర్తానికి వందమైళ్ళ దూరంలో మామయ్యగారి ఇంట్లో శశి పెళ్ళి కూడా జరిగి ఉంటుంది. మిస్ శశి... మిసెస్ శశీ రామచంద్ర మూర్తిగా మారిపోయింది. పధ్నాలుగేళ్ళ శశి... పోయిన సంవత్సరం ఇక్కడికి వచ్చినప్పుడు తన చిన్న చెల్లెలులా తిరిగిన శశి పెళ్ళికూతురై గృహిణి అయింది!

భారతి కవరు మళ్ళా బల్లమీద పడేసి తల్లిని తలుచుకుంది. శశి పెళ్ళి శుభలేఖ రాగానే ముందు తామందరమూ బయలుదేరి వెళ్ళాలని అన్నదామె తల్లి. భారతి ఒక్క క్షణం ఆగి తల ఊపుతూ "నేను రానులే అమ్మా!" అన్నది. ఆమె ఆశ్చర్యపోయి "అదేమిటే మా తల్లీ, అలా అంటావు? వాళ్ళేమైనా మనకు పరాయివాళ్లా! శశి పెళ్ళికి వెళ్ళకపోవటం ఏమిటే? పైగా నీకు అదంటే అభిమానం కూడా కదా?" అన్నది. భారతి "అదికాదమ్మా..." అంటూ ఏదో

చెప్పబోయి మానుకుని చివాలున లేచి వెళ్ళిపోయింది. ఆమె తండ్రి ఆమె మనసు అర్థంచేసుకుని ఏమీ మాట్లాడ కుండా కూర్చుండిపోయాడు. తల్లి విసుగుతో "ఏమిటో బాబూ! ఈ పిల్లతో వేగడం కష్టంగానే ఉంది..." అను కున్నది. తర్వాత పెళ్ళికి తల్లీ తండ్రీ ఇద్దరూ ప్రయాణమై వెడుతూవుంటే భారతి "నాన్నా! మామయ్య అడిగితే నాకు సెలవు దొరకలేదని సర్దిచెప్పు..." అన్నది. ఆమె తల్లి "సరేలే అమ్మా! నీకు రావటం కష్టమైనంత మాత్రంలో ఏదో ఒక సాకుచెప్పి తప్పుకోవడం మాకు కష్ట మవుతుంతా ఏమిటి?" అన్నది. ఆమె అమాయకురాలు. ఒట్టి బోళా మనిషి..

భారతికి మనస్సు కలుక్కుమన్నది. కళ్ళ ఎదురుగా మనసును రంపపుకోతపెట్టే దృశ్యం. తన తల్లిని పెళ్ళికివచ్చిన వారందరూ వంతులప్రకారం ఎవరి కెదురయితే వారు కావాలని పలకరిస్తున్నారు. "ఏవమ్మా! పిల్లపెళ్ళి ఎప్పుడు చేస్తావు?" అని ఒకరూ, "ఎదిగిన ఆడపిల్లను ఇంట్లో ఇంకా ఎలా ఉంచుకున్నావమ్మా? మా లచ్చికి తొమ్మిదో ఏడు... నా కప్పుడే కాళ్ళక్రింద మంటలు పెట్టినట్టుగావుంది. సంబం ధాలకోసం మావారు కాలికి బలపాలు కట్టుకు తిరుగుతున్నా రంటే నమ్ము..." అని ఒకరూ, "ఎదిగినపిల్ల గుండెలమీద కుంపటేసుమా..." అని ఒకరూ, "ఏది ఏమయినా పెళ్ళి, దాని అచ్చటా ముచ్చటా చిన్నతనంలో చేస్తేనేసుమీ! ఎద్దుల్లాగా ఎదిగాక ఏం పెళ్ళిళ్ళు? ఏం వేడుకలు?" అని మరొకరూ అంటున్నట్లూ, ఆమె తల్లి ఏ సమాధానమూ

చెప్పలేక అవమానంతో ముఖం కందగడ్డకాగా పైకిమాత్రం నవ్వడానికి ప్రయత్నిస్తున్నట్టూ వూహించుకుని భారతి నిలువెల్లా వణికిపోయింది.

తర్వాత ఆమె కాస్సేపు కిటికీప్రక్కనే కుర్చీలో కూర్చున్నది. మొదటి ఆట సినిమా వొదిలినట్టున్నారు. వీధిలో గణగణమని శబ్దంచేస్తూ ఒకరిక్షా వెళ్ళిపోయింది. అందులో పసిపిల్లవాణ్ణి వొళ్ళో కూర్చోబెట్టుకుని ఒకామె కూర్చునివుంది. ప్రక్కన ఉన్నది భర్తకాబోలు. అతడేదో చెబుతూవుంటే వింటూ ఆమె నవ్వుతున్నది. తర్వాత ఒక ముష్టిమనిషి కేకవేసుకుంటూ నడిచిపోయింది. ఆ తర్వాత ఒక్క నిముషంసేపు ఎవరూ వీధిలో కనబడలేదు. అంతలో తెల్లని పలుచని చీరె కట్టుకున్న పద్దెనిమిదేళ్ళ యువతీ, నల్లని సూటువేసుకున్న పాతికేళ్ళ యువకుడూ చేతులు పట్టుకుని ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ గలగల నవ్వుకుంటూ నడిచిపోయారు.

భారతి లేచింది. కిటికీ రెక్కలు రెండూమూసి వీధి గుమ్మందగ్గరికి నడిచింది. వీధి తలుపులు రెండూ బార్లగా తీసింది. గదిలోని కాంతి తలుపులు తియ్యగానే రెండుగీతలు గీచినట్టు పంచలో కొంతమేర పడింది. అందులో తన నీడ... చలిగాలికి పమిటకొంగు మెడచుట్టూ చుట్టుకుని ఆమె తన కదలని నీడను చూసుకుంటూ కొద్దిక్షణాలు నిలబడిపోయింది.

ఎడమవైపు అరుగుమీద అంతవరకూ పడుకునివున్న వ్యక్తి అలికిడివిని తలతిప్పి చూశాడు. అతనికి పంచలో

కొంతమేర వెలుగూ, అందులో భారతి నీడా కనిపించి ఉండాలి. భారతి అరుగుమీద ఎవరో ఉండటం గమనించి కూడా 'ఎవరో లెమ్మ'నుకుని వెనుదిరగబోతుండగా ఆ వ్యక్తి త్వరత్వరగా అరుగు దిగివచ్చి "ఏమండీ ... విపరీతంగా దాహం వేస్తున్నది. కాసిని మంచినీళ్ళిప్పిస్తారా?" అని అడిగాడు.

భారతి లోపలికి నడిచింది. వంటయింటిలోనుంచి మర చెంబుతో నీళ్ళు, ఒక గ్లాసూ తీసుకుని చీరె కొంగు మెడ చుట్టూ చుట్టుకుంటూ ముందుగదిలోకి వచ్చేసరికి ఆ వ్యక్తి గుమ్మంలో నిలబడివున్నాడు ఆమె కొద్దిదూరంలో నీళ్ళ చెంబు ఉంచగా దాన్ని తీసుకుని నీళ్ళు గ్లాసులోకి వంచుకొని అతడు మూడుగ్లాసుల నీళ్ళు త్రాగాడు. ఎంతగా దాహంతో బాధపడుతున్నాడో మరి. కన్నెత్తకుండా గడగడ మూడు గ్లాసులనీళ్ళూ త్రాగేసి అప్పుడు త్రేన్చుతూ "పోయేప్రాణాలు నిలబెట్టినట్లయిందండీ..." అన్నాడు

భారతి ఇంతసేపూ ప్రతిమలా కదలకుండా నిలబడి పోయి అతన్ని పరిశీలించింది. అతడు తనకు అపరిచితుడు కాదు. ఎప్పుడో ఏ సందర్భంలోనో తామిద్దరికీ పరిచయం ఉంది. ఎక్కడ? ఎప్పుడు?

అతని గడ్డం మాసివుంది. ధరించివున్న పైజమా, చొక్కా కొద్దిగా మాసివున్నాయి. మెడలో ఒక ముక్కు-పొడి రంగు మఫ్లరువుంది. క్రాపు రేగివుంది. రైలు ప్రయాణం చేసివచ్చినవాడిలా ఉన్నాడు కొంచెం దళసరి అద్దాల కళ్ళజోడును ఒక వ్రేలితో సర్దుకుంటూ మరొకచేత్తో నీళ్ళ

చెంబూ, గ్లాసూ ఆమెకు చేరువలోవుంచి అతడు తలయెత్తి చూశాడు.

అతడు ఉన్నట్టుండి "మీ పేరు భారతికదూ?" అని అడిగాడు. ఆమె తలవూపింది. కాని అతనెవరో ఆమెకు ఇంకా గుర్తురాలేదు.

అతడామెనుచూసి నవ్వుతూ "నన్ను గుర్తుపట్టలేదా! మీతో బి. ఏ. చదువుకున్నాను. నాపేరు విశ్వేశ్వరరావు...'విశ్వం' అంటూ వుండేవారందరూ..." అన్నాడు.

అప్పుడామె గుర్తుతెచ్చుకుని "ఓహో! అలా చెప్పండి. మీరు బి. ఎ. మొదటి సంవత్సరంలో నాటకంవేసి కాలేజీ ఉత్తమనటుడుగా వచ్చారుకూడా...ఇప్పుడు గుర్తు వచ్చింది" అన్నది.

అతడు నవ్వి "అందుకే బి. ఎ. పరీక్ష సున్నాచుట్టింది. అప్పుడందరూ నన్నొక గొప్ప యాక్టరనుకునేవారు. ఆ మాట నా ముందే అనేవారుకూడా. దానితో కళ్ళు నెత్తికెక్కి చదువుధ్యాస ఒదిలి పరీక్షలు చెడగొట్టుకున్నాను" అన్నాడు.

భారతి కుర్చీకొంచెం పక్కకుజరిపి "ఇలాకూర్చోండి" అన్నది. అక్కడ ఒకేకుర్చీ ఉండటంతో సందేహిస్తున్న అతన్నిచూసి "ఫరవాలేదు. మీరు కూర్చోండి... నే నిలా నిలబడి మాట్లాడుతాను. అన్నట్టు మీరిప్పుడేం చేస్తున్నారు?" అని అడిగింది.

విశ్వం కళ్ళజోడు తీసి చొక్కా చివరలతో తుడుస్తూ నెమ్మదిగా "మద్రాసులో ఒక ప్రయివేట్ కంపెనీలో ఉం

టున్నాను. నెలకు రెండువంద లిస్తారు. నా భార్య ఒక స్కూల్లో టీచరు...ఆమెకు నూట అరవై వస్తాయి" అని చెప్పాడు.

తర్వాత ఒక్కక్షణం ఆగి మళ్ళీ "ఈ వూరికి చాలా చిత్రమైన పరిస్థితులలో వచ్చి చిక్కుపడిపోయాను" అంటూ జేబులోనుంచి ఒక ఉత్తరంతీసి "చూడండి 'నవకళా పరిషత్తు' అనే నాటకసమాజం ఉందిట యీ వూళ్లో. వారు యీ రాత్రి నేను వ్రాసిన ఒక నాటకం ప్రదర్శిస్తున్నామనీ వీలుచేసుకుని వస్తే ఆనందిస్తామనీ వ్రాశారు. ఆ వ్రాయడం కేవలం మొక్కు తీర్చుకున్నట్టే వుందిగాని రచయిత తప్పక వచ్చి చూడాలని వారనుకున్నట్టు తోచడంలేదు. కేవలం ఒక ఉత్తరంవ్రాసి వూరుకున్నారు. ఎంతయినా నాటకం వ్రాసినవాణ్ణికదా? ప్రదర్శన ఎలా ఉంటుందో చూద్దామని కోరిక చంపుకోలేక ఛార్జీలుపెట్టుకుని బయలుదేరివచ్చేశాను. తీరా స్టేషనులో దిగినతర్వాత ఆ బాపతు జనాభా ఎవరూ ప్లాట్‌ఫారంమీద కనిపించలేదు. ఇది నాకు కొత్తవూరు. పైగా తెలిసినవారెవరూ లేరు. వీథులన్నీ గంటన్నరసేపటి నుంచీ తిరిగి తిరిగి ఇక్కడికి చేరుకున్నాను" అన్నాడు.

భారతి "మరి మీ భోజనం..." అంటూవుండగా అతడు అర్థోక్తిలో ఆపి నవ్వుతూ "ఆ దిగులక్కరలేదు లెండి...హోటల్లో భోజనం ముగించుకునే వచ్చాను" అని చెప్పాడు. తర్వాత బిడియపడుతూ "మీరు నిలబడే ఉన్నారు" అన్నాడు.

ఆమె "ఫరవాలేదులెండి...అయితే మీరు నాటకాలు వ్రాస్తూవుంటారా ?" అన్నది.

విశ్వం కళ్ళజోడు తీసి మళ్ళీ చొక్కా చివరలతో దాన్ని తుడుస్తూ నెమ్మదిగా "ఆఁ! ఏదోలెండి... ఉబుసుపోకకు తీరిక దొరికినప్పుడు ఏదో గిలుకుతూ ఉంటాను. అవి ఏవయినా పత్రికలలో అచ్చయితే యిలాగే నాటక సమాజాలవారు అప్పుడప్పుడు తాము అక్కడ ప్రదర్శిస్తున్నామనీ, ఇక్కడ ప్రదర్శిస్తున్నామనీ ఉత్తరాలు వ్రాస్తూవుంటారు. సాధారణంగా నేనుఎక్కడికీ వెళ్ళను. ఇవాళవీరుప్రదర్శిస్తున్నామని వ్రాసిన యీ నాటకం నాకు చాలా ఇష్టం... దాన్ని చాలా కష్టపడి వ్రాశాను నేను. అందుకే అది ఎలా ఉంటుందో చూడాలని కోరిక ఆగక ఇలా బయల్దేరి వచ్చేశాను" అని చెప్పాడు.

భారతి నవ్వి "బహుశా వాళ్ళు కేవలం ఫార్మల్‌గా ఒక ఉత్తరంవ్రాసి పడేసిఉంటారు 'మీరు అంతదూరంనుంచి రాబోయూరా!' అని అనుకుని ఉంటారు. ఆ ఉత్తరం నమ్ముకుని మీరు వచ్చేశారు...అన్నట్టు మనం చదువుకునే రోజుల్లో ఫైనలియర్‌లో గోపాలరావనే ఆయన ఉండేవాడు. గుర్తుందా మీకు! ఆ రోజులలో ఆయన పద్యాలూ, కథలూ వ్రాస్తూ ఉండేవాడు. కొన్ని పత్రికలలో అచ్చవుతూ ఉండేవి కూడా. ఈ మధ్య ఆయన పేరే కనిపించడంలేదు" అన్నది.

విశ్వం గుర్తుతెచ్చుకుని నవ్వి "ఓహో! మా గోపాలం మాటేనా మీరు చెప్పేది? వాడు మన క్లాస్‌మెట్

మాత్రమేకాక మా రూమ్‌మేట్‌కూడా. మీరు చెప్పి నట్టు ఆ రోజుల్లో వాడు కథలు మంచివే వ్రాసేవాడు. వాడి కిప్పుడు పెళ్ళయింది...ఇద్దరు పిల్లలుకూడా ననుకుంటాను. వాడిప్పుడు రైల్వేలో గార్డు...ఒకసారి ఎక్కడో కనిపిం చాడుకూడా. ఆ డ్యూటీతోనే వాడికాలం వెళ్ళమారి పోతున్నది. 'ఇక కవిత్వమూ, కథలూ ఎక్కడ? అన్నిటికీ ఒక్క నమస్కారంపెట్టి వూరుకున్నాన'ని చెప్పాడు... పాపం..." అన్నాడు.

భారతి నవ్వి వూరుకున్నది. విశ్వం ఒక్క క్షణం ఆగి "అన్నట్టు మా విషయాలన్నీ రాబట్టారు కాని, మీ సంగతు లేవీ చెప్పారుకాదు. మీకు పెళ్ళి అయిందా? పిల్లలా?" అని అడిగాడు.

భారతి చీరచెంగు మెడచుట్టూ లాక్కుంటూ "నాలు గేళ్ళయిందండీ..ఇంకా పిల్లాపీచూ లేరు..వారు ఇక్కడొక దిన పత్రికలో సబ్ ఎడిటర్‌గా ఉంటున్నారు. ఇవాళ వారికి నైట్‌డ్యూటీ...పొద్దున ఎనిమిది గంటలకుగాని రారు. మా అత్తగారు పెద్దది. జబ్బుమనిషి...లోపల గదిలో పడుకుని ఉందిప్పుడు. ఆవిడ పెందరాళే నిద్రపోతారు..." అన్నది.

విశ్వం సర్దుకుని కూర్చుని మెడలో మఫ్లర్ పోగులు లాగుతూ అన్నాడు, "ఏమిటోనండి...ఆ చదువుకునే రోజుల నాటి జీవితం మళ్ళీరాదు...అప్పుడు ఏ బరువులూ, బాధ్య తలూ లేకుండా హాయిగా స్వతంత్రంగా ఉండేవాళ్ళం... అన్నట్టు మీకు మన యింగ్లీషు లెక్చరరు గిరీశంగారు గుర్తు న్నారా? ఆయన అమెరికా వెళ్ళారట యీ మధ్య...ఎకన

మిక్స్‌లో ఒక నల్లని లావుపాటి లెక్చరరుండేవాడు...ఆయన పేరు గుర్తురావడంలేదు...ఆయన సముద్ర స్నానానికి వెళ్ళి మునిగి చచ్చిపోయాడు."

భారతి ఏమీ మాట్లాడలేదు. విశ్వం నెమ్మదిగా "మీతో కలిసి కాలేజీకి వొస్తూవుండేది కోమలి... ఇప్పుడెక్కడుంది?" అని అడిగాడు.

భారతి కదిలింది. లోపలి గదిలోకి నడుస్తూ "మీకు తెలీదా? ఆ అమ్మాయికి రెండేళ్ళ క్రిందట పెళ్ళయింది. కాని, మూడు నాలుగు నెలల క్రిందటనే నేనొక విషయం విన్నాను..." అన్నది ఆమెకు అన్ని విషయాలూ గుర్తు వచ్చాయి. కాలేజీలో చివరి సంవత్సరంలో ఈ విశ్వం, ఆ కోమలి అనబడే పిల్లను ఎన్నోవిధాలుగా బాధపెట్టాడు. ఆ పిల్ల కుందనపు బొమ్మలా ఉండేది. సన్నగా, తెల్లగా, నడయాడు తున్న వెన్నెల తీగలా ఉండేది. మెత్తగా మధురంగా మాట్లాడేది. ఆ పిల్ల నితడు ప్రేమించాడుట... అలా అని ఉత్తరాలు వ్రాశాడు. వెంటబడి గోలచేశాడు. నలుగురిలో అప్రతిష్ఠపాలుచేశాడు. ఇప్పుడా దీనురాలి గురించి వాకబు చేస్తున్నాడు. ఇతనికేం? మహారాజులాగా పెళ్ళి చేసుకుని మంచి ఉద్యోగం చేస్తూ సుఖపడుతున్నాడు. పాపం! ఆ అమ్మాయిగతి చూడరాదూ, ఏమయిందో!

ఒక్క క్షణం ఆగి లోపలినుంచే పెద్దగా "ఆమె ఆత్మహత్య చేసుకుందని విన్నాను. ఎందుకో మరి..." అన్నది. ఆ మాటలు అని కొద్ది క్షణాలాగి ముందు గదిలోకి వచ్చింది. విశ్వం కుర్చీలో దిగాలుపడినట్టు కూర్చుని

ఉన్నాడు. అతని చేతిలో కళ్ళజోడున్నది. కళ్ళలో ఎక్కడో నీటిపొర ఒకటి దీపపు వెలుగులో తళుక్కుమన్నది. ఒక్క నిముషం తర్వాత విశ్వం సర్దుకుని కూర్చుని మళ్ళీ కళ్ళజోడు తుడుచుకున్నాడు. ఏమీ మాట్లాడలేదు.

బల్లమీది అలారం గడియారం టిక్కుటిక్కు మంటు న్నది. చుట్టుపక్కల అంతా ప్రశాంతంగా నిశ్శబ్దంగా ఉంది. చల్లనిగాలి తెరలు తెరలుగా వీస్తున్నది.

భారతి మళ్ళీ "కోమలి ఎంత మంచి కథలు వ్రాసేదో తెలుసా? ఎన్నోసార్లు పత్రికలలో ఆమె వ్రాసిన కథలు చది వాను అన్నీ కొత్త కొత్త కథలు....ఆమెను నే నెప్పుడూ మళ్ళీ కలుసుకోలేదనుకోండి....అయినా ఆమె పేరుతో అచ్చ యిన ప్రతి కథనూ నేను మళ్ళీ మళ్ళీ చదివాను. ఎన్నో సార్లు ఆమెకు ఉత్తరాలు వ్రాద్దామనుకున్నాను కాని ఆమె అడ్రసు తెలియలేదు. అయినా నాలుగైదుసార్లు పత్రికల వారికి ఉత్తరాలు వ్రాసి రీడైరక్టుచేయమనికోరాను. వారలా చేసే ఉంటారు. అయినా నాకు సమాధానం రాలేదు ఎందు చేతనో మరి" అంటూ ఆగి మళ్ళీ "పైగా మరొక చిత్రం ఏమిటంటే ఆమె వ్రాసిన ప్రతి కథలోనూ ఏదో ఒకపాత్ర ఆత్మహత్య చేసుకుంటుంది. ఒక్కొక్క కథలో ఒక్కొక్క పాత్రఒక్కొక్కపద్ధతిలో ఆత్మహత్య చేసుకుంటుందన్నమాట. ఒక కథలో నాయకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసు కున్నాడనుకోండి. మరో కథలో మరో అమ్మాయి ఉరిపో సుకు చచ్చిపోతుంది.... మరో కథలో వంటెనిండా కిరస

నాయిలు పోసుకుని నిప్పంటించుకోవడం ... అలా అన్న మాట ...” అన్నది.

విశ్వం ఉదాసీనంగా నవ్వి వూరుకున్నాడు. భారతి మళ్ళీ ఏమీ మాట్లాడలేదు. క్రమంగా నిముషాలు గడుస్తున్నాయి. సెకండ్లముల్లు టిక్కు-టిక్కు-మని ధ్వనిచేస్తూ నిర్విరామంగా ముందుకు పరుగెత్తిపోతున్నది.

భారతికి నిద్ర వస్తున్నది. ఆమె లేచి “మీరు ఈ గదిలో పడుకోండి. నేను వెనకవైపు మా అత్తగారి గదిలో పడుకుంటాను” అన్నది.

విశ్వం “మీకు ఇబ్బంది కలిగిస్తున్నట్టున్నాను. ఓ చాప ఇస్తే చాలు, ఇలా పరుచుకుని పడుకుంటాను” అన్నాడు.

భారతి చాప పరిచి ఒక దిండు పడేసి ముందు తలుపు గడియవేసి లోపలికి వెళ్ళబోతూ “మళ్ళీ మీకు దాహ మవుతుందేమో, యీ నీళ్ళచెంబు ఇక్కడే ఉంచుతున్నాను” అని చెప్పింది. విశ్వంచాపమీద కూర్చునిఉండి తలవూపాడు.

మరొక పావుగంట తర్వాత భారతి లోపలి గదిలో వెచ్చగా దుప్పటిలో ముడుచుకు పడుకుని ఉంది. తాను ఒంటరిగానే ఉన్నప్పటికీ ఇప్పుడాట్టే భయమేమీలేదు. తాను కల్పించిన అత్తగారి పాత్ర ఇప్పుడు తనకు రక్షణ ఇస్తుంది. హాయిగా నిశ్చింతగా నిర్భయంగా నిద్రపోవచ్చు ... ఆమెకు మాగన్నుగా నిద్రపడుతున్నది.

నిద్రలో పంచరంగుల కల... విశాలమైన ఆవరణలో వెనకగా ముచ్చటైన యిల్లు... ఆవరణ నిండా రంగురంగుల పూలచెట్లు... నేలమీద ఒత్తుగా అందంగా పట్టువలె పెరిగి

ఉన్న మృదువైన పచ్చిక... దానిమీద ఖరీదైన తివాచీ పరుచుకుని కూర్చుని తాను ఏదో చదువుకుంటున్నది. ఆమె భర్త పక్కనే వెల్లికిలా పడుకుని గుండెలమీద రెండేళ్ళ పసివాణ్ణి కూర్చోబెట్టుకుని ఆడిస్తున్నాడు. తాను చదవటం ఆపి తలపైకెత్తి చూసేసరికి ఆకాశంలో రంగురంగుల ఇంద్ర ధనుస్సు... పసిపిల్లలా కువకువలాడుతూ భర్తను చేత్తోతట్టి "అదుగో... అటుచూడండి..." అన్నది తాను.

దానివెంటనే మరొక కల... దిగంతాలను చుంబిస్తూ రొదచేస్తున్నది సముద్రం. తెల్లని వెండిపళ్ళెంలా వెలుగులను చిమ్ముతున్న చంద్రబింబం ఆ అనంత జలరాశికి చిత్ర విచిత్రమైన రంగులను వేస్తున్నది. తీరాన తామిద్దరూ ఎన్నో జన్మలనాటి ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ అటూ యిటూ తిరుగుతున్నారు.

ఆ తర్వాతకూడా అదే తరహా కలలు భారతికి బోలెడు వచ్చాయి. అయితే తెల్లవారి మెలకువ వచ్చినతర్వాత అవి అన్నీ గుర్తులేవు. మొదటి రెండు కలలూమాత్రం ఎన్నాళ్ళకూ మరపురానంత గాఢంగా మనస్సుకు హత్తుకు పోయాయి.

ఆమె లేచి కొనగోళ్ళతో తల సవరించుకుంటూ ముందుగది గుమ్మందగ్గరకువచ్చి చూసేసరికి విశ్వం ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. అతని కళ్ళజోడు కుర్చీమీదవుంది.

భారతి తనలో తాను నవ్వుకుని లోపలికి వెళ్ళి పనులలో నిమగ్నమైపోయింది. కాఫీ కుంపటి వెలిగించి నీళ్ళు పడేసి ముఖం కడుక్కునేసరికి ఎండవచ్చింది. నీళ్ళు దింపి

కాఫీపొడివేసి పాలగిన్నెను కుంపటిలోవుంచి ముందు గదిలోకి వెళ్ళి చూసింది. విశ్వం అప్పుడే లేచాడు కాబోలు. కళ్ళ జోడు తడివి తీసుకుని మొహానికి తగిలించుకున్నాడు. ముందు ఆమెనుచూసి నవ్వి తర్వాత టేబిల్‌మీది గడియారంవైపు చూపులుతిప్పి "అరె...చాలా టైమయిపోయిందే...నాకు ఎనిమిది గంటలకు బండి..." అన్నాడు.

భారతి నీళ్ళచెంబూ పళ్ళపొడి ముందుగదిలోకి తెచ్చివుంచి "ఇంకా వ్యవధి ఉందిలెండి...మొహం కడుక్కుని కాఫీ తీసుకుని వెడుదురుగాని..." అన్నది.

అతడు కళ్ళజోడు మళ్ళీ కుర్చీమీదవుంచి పళ్ళపొడి కొద్దిగా చేతిలో వేసుకుని నీళ్ళచెంబు తీసుకునివెళ్ళి అరుగు మీద కూర్చుని ముఖప్రక్షాళనం ప్రారంభించాడు.

భారతి కాఫీ కలిపి తాను తాగి అతనికోసం కప్పులో పోసి సిద్ధంగావుంచి తనలో తాను "మరి..అత్తగారికో కాఫీ.. పాపం అసలే జబ్బుమనిషి.. పైగా పెద్దతనంకూడా" అనుకుని నవ్వుకుంది. తర్వాత "ఎనిమిది గంటలకు శ్రీవారు వస్తారుగా. అప్పటికి సిద్ధంగా కాఫీ ఫ్లాస్కులో ఉంచవద్దూ" అనుకుని మళ్ళీ నవ్వుకుంది.

విశ్వం మాసిన చేతిరుమాలుతో మొహం తుడుచుకుని కళ్ళజోడు పెట్టుకుని కుర్చీలో కూర్చుని ఉన్నాడు. భారతి కొంగు మెడచుట్టూ చుట్టుకుని కాఫీతెచ్చి అతని చేరువలోవుంచి "తీసుకోండి" అన్నది. అతడు బిడియపడుతూ కప్పు చేతిలోకి తీసుకున్నాడు. తర్వాత ఒక్కసారి కాఫీ చప్పరించి తల పైకెత్తి చూసి "మరి...కాఫీమీకో?" అన్నాడు.

"నే నిప్పుడు తాగనులెండి...ఎనిమిది దాటిన తర్వాత వారు డ్యూటీనుంచి వస్తారు. అప్పు డిద్దరమూ ఒక్కసారే తాగుతాము. ఏమిటో! ఇన్నేళ్ళనుంచీ అలాగే అలవాటయి పోయింది...మా అత్తగారికి ఇప్పుడే ఇచ్చివచ్చాను..." అని చెప్పింది భారతి మళ్ళీ పమిటచెంగు మెడచుట్టూ లాక్కుంటూ. పైగా, ఒక్కక్షణం ఆగి "మీరు ఎనిమిది గంటల బండికే వెళ్ళిపోవాలంటున్నారు. లేకపోతే ఆయన రాగానే పరిచయం చేద్దును" అన్నది.

విశ్వం ఖాళీకప్పు క్రిందవుంచుతూ "ఆఁ! ఎందుకు లెద్దురూ...ఇప్పటికే మీకు చాలా ఇబ్బంది కలిగించాను. ఇక సెలవు తీసుకుంటాను" అంటూ లేచాడు. జేబులో చెయ్యిపెట్టి కొన్ని చిల్లర రూపాయినోట్లు యివతలికి తీసి లెక్కపెట్టుకుని 'చాలు' అని గొణుక్కున్నాడు. తర్వాత చేతులు జోడించి 'సెలవు' అన్నాడు. ఆమెకూడా తల వూపుతూ చేతులు జోడించింది.

అతడు నెమ్మదిగా అడుగులువేస్తూ వీధివాకిలిదాకా వెళ్ళి ఎందుకో ఒక్క క్షణం నిలబడిపోయాడు. భారతికి అను మానంవేసింది. అతడు తనను గురించి తాను కల్పించిచెప్పిన వన్నీ నమ్మినట్టు నిదర్శనం ఏమిటి? వెనుదిరిగివచ్చి "ఎందు కలా అబద్ధాలు చెప్పారు? నే నంత నమ్మదగనివాణ్ణి దురాత్ముణ్ణి అనుకున్నారా?" అని అడుగుతాడేమో! ఒకవేళ నిజంగా అలా అడిగితే ఏంచెప్పాలో తోచలేదామెకు.

విశ్వం వెనుదిరిగి ఆమెవంక చూశాడు. అతని కళ్ళు నీళ్ళతో నిండుతున్నాయి. అతడు ఒక్క అడుగు ముందుకు

వేసి ఆర్ద్రస్వరంతో "ఈ దిక్కులేని వూళ్ళో నన్ను సోదరిలా ఆదరించారు మీరు. మీకు నన్నుగురించి అంతా నిజమే చెప్పడం ముఖ్యమనిపిస్తున్నది. ఇన్నేళ్ళుగా ఎందరిదగ్గరో ఎన్నో అబద్ధాలు చెప్పాను. ఎంతోమందిని కేవలం మాటలు చెప్పి మోసంచేశాను. కాని మీ దగ్గర అలా చేయలేక పోతున్నా నెందుకో! మీరు నన్ను ఆదరించడమేగాక కోమలిని గురించిన సమాచారం అందించి పుణ్యంకట్టుకున్నారు. నేనూ, మా ఆవిడా ఉద్యోగాలు చేస్తున్నామని చెప్పాను కదూ? అది అబద్ధం. నాకసలు పెళ్ళికాలేదు. నేను చేసుకోలేదు. కోమలికి నేను ద్రోహం చేశాననిపించింది. ఆమెను నేను మనసారా ప్రేమించాను. అది వాస్తవం. ఆమె ప్రేమనుకూడా పొందాను. కాని అదే నా దౌర్భాగ్యం. అనేక కారణాలమూలంగా ఆమెనుమాత్రంపొందలేకపోయాను. ఆమెకు పెళ్ళి అయిందనీ, ఆత్మహత్య చేసుకుందనీ మొదటిసారి ఇదే నేను వినటం...నాకింతవరకూ ఆమెను గురించిన ఏ వివరమూ తెలియదు. నమ్మండి" అంటూ ఆగాడు. మళ్ళీ తన్ను తాను సంబాళించుకుని "కోమలిని పొందలేని నా బలహీనతకు ప్రాయశ్చిత్తంగా ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. ఎన్నోసార్లు ప్రయత్నించానుకూడా. కానీ ధైర్యం చాలలేదు. నాకులేని సాహసం కోమలికున్నది. అందుకే ఆమె అలా దాటిపోయింది. ఆత్మహత్య చేసుకుందామనిపించినప్పుడల్లా కథవ్రాసి అందులో నన్నొక పాత్రలో వూహించుకుని ఆ పాత్ర ఆత్మహత్యకు పాల్పడేట్టుచేసి తృప్తిచెందే

వాణ్ణి. మీరు కోమలి పేరుతో చదివిన కథలన్నీ నేను వ్రాసినవే. మీఉత్తరాలుకూడా నాకుచేరాయి..'' అన్నాడు.

భారతి గుమ్మాని కానుకుని నిలబడి వింటున్నది. అతడు మళ్ళీ "నేను చేసే ఉద్యోగం ఏమిటో చెప్పనా? చాలా సినిమాల్లో యుద్ధదృశ్యాలుంటాయి చూడండి. రాజులతోపాటు వాటిలో వెనక పోట్లాడుతూ ఉండేందుకు ఎందరో మనుషులు కావలసివస్తారు. ప్రతి సినిమాలో ఆ సీనులలో రెగ్యులర్‌గా పాల్గొనేవాళ్ళలో నే నొకణ్ణి. రోజూ ఇంతని జీతం ఇస్తారు. అది నా ఉద్యోగం ఏదో అలా గడిచిపోతున్నది జీవితం ...'' అంటూ కళ్లు తుడుచుకుని "ఎందుకో అన్ని వాస్తవ విషయాలూ మీముందు మనసు విప్పి చెప్పాలనిపించింది. చెప్పాను. మన్నించండి .... వీటిని మనసులో ఉంచుకోకండి. చక్కగా వివాహం చేసుకుని సుఖంగా ఉన్నారు. మీ మనసులో ఈ క్షుద్ర విషయాలు నింపటం నా అభిమతంకాదు .... సెలవు...'' అని గిరుక్కున వెనుదిరిగి పెద్ద పెద్ద అంగలువేస్తూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

తెల్లబోయి శిలా పతిమలా నిలబడిపోయింది మిస్ భారతి బి. ఏ.